
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
మంగళవారం, 9 ఏప్రిల్ 2024



మంగళవారం ఉష్ణోగ్రత

	కనిష్ఠం	గరిష్ఠం
ఖమ్మం	26	38
భద్రాద్రి	26	42

రంజాన్ వేళలు



ఇఫ్తార్ : 6:28 (ఆదివారం)
సహర్ : 4:33 (సోమవారం)

నేడు శ్రీ క్రోధి నామ ఉగాది



- ప్రత్యేక పూజలకు ముస్తాబైన ఆలయాలు
- పంచాంగ శ్రవణాలకు ఏర్పాట్లు

ఖమ్మం ఖానాపురంహవేలి, ఏప్రిల్ 8: తెలుగా సంవత్సరాధి ఉగాదికి వేళైంది. తెలుగువారి తొలి పండుగ అయిన ఉగాదికి ఎంతో విశిష్టత ఉంది. చైత్రమాసం వసంత రుతువులో జరుపుకొనే ఈ ఉగాదితోనే పండగలు ప్రారంభమవుతాయి. మంగళవారం శ్రీక్రోధి నామ సంవత్సర ప్రారంభమవుతుంది. ఉగాది రోజున షడ్రుచుల మేళవింపుతో చేసిన ప్రసాదాన్ని అందరికీ పంచడం ఆనవాయితీ. ఇక ఉగాది రోజున నిర్వహించే మరో ప్రధానమైన కార్యక్రమం పంచాంగ శ్రవణం. ఆయా రాశులవారు క్రోధి నామ సంవత్సరంలో తమ జాతక ఫలాలు ఎలా ఉన్నాయో చూసుకుంటారు. పండితులు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి. పంచాంగ శ్రవణం చేస్తారు. రైతులు పొలాల్లో సాగుపని ప్రారంభిస్తారు. ఉగాది ఉత్సవాలకోసం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఆలయాలన్నీ ముస్తాబయ్యాయి. ఉగాది సందర్భంగా తెలుగువారు తెల్లవారుజామునే నిద్రలేచి స్నానాలు ఆచరించి, ఇంట్లో దేవతార్చన, పంచాంగ పూజ నిర్వహిస్తారు. ప్రత్యేకంగా తయారు చేసిన ఉగాది పచ్చడి, భక్ష్యాలు, పూర్ణాలను నైవేద్యంగా సమర్పించి అనంతరం పిండివంటలతో భోజనం చేస్తారు. సాయంత్రం పంచాంగ శ్రవణం, కవిత్వ, సాహిత్య గోష్ఠుల్లో పాల్గొనడం ఆనవాయితీ. శ్రీరామ నవరాత్రులు ఉగాది నుంచే ప్రారంభమవుతాయి.

ఉగాది రోజున షడ్రుచులతో కూడిన పచ్చడి స్వీకరించందే ఏ పదార్థాన్ని తీసుకోరు. తీపి, కారం, చేదు, పులుపు, ఉప్పు, వగరు అనే ఆరు రుచుల కలయికే ఉగాది పచ్చడి. మనిషి కూడా తన జీవితంలో కష్టసుఖాలను, తీపి చేదు అనుభవాలను ధైర్యంగా ఎదుర్కోవాలనే భావన ఇందులో దాగి ఉంది. ఉగాది సందర్భంగా గత రెండు రోజులుగా మార్కెట్‌లో పండుగ సందడి నెలకొంది. మామిడికాయలు, వేపపువ్వు, కొత్త కుండలు, బెల్లం, చింతపండు, శనగపప్పు పండుగకు కావాల్సిన వస్తువులను ప్రజలు కొనుగోళ్ల చేస్తున్నారు.



ప్రజలు పాడిపంటలతో వర్ధిల్లాలి
వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల

శ్రీక్రోధి నామ సంవత్సరంలో ఉమ్మడి జిల్లా ప్రజలు పాడి పంటలు, అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలి. రైతులు, రైతు కూలీలు, కార్మికులు, ప్రజలు అతివృష్టి, అనావృష్టి బారిన పడకుండా సుఖశాంతులతో ఉండాలి.



ప్రజలందరికీ మంచి జరగాలి
రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి

కొత్త సంవత్సరంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలందరికీ మంచి జరగాలి. షడ్రుచుల ఉగాది పంచ్చడి మాదిరిగానే జీవితంలోని కష్ట సుఖాలను సమానంగా తీసుకొని ముందుకు సాగాలి. ప్రజలు సంతోషంగా జీవించాలి.



ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలి
కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి


నూతన ఏడాదిలో ఉమ్మడి జిల్లా ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలి. అందరికీ ఉగాది తెలుగు సంవత్సరాది శుభాకాంక్షలు. సంప్రదాయ వేడుకలు నిర్వహించి సందడి చేయాలి. ఉగాది పచ్చడి రుచులతో తెలుగు లోగిళ్ల వెలగాలి.



కొత్త ఆశలు, ఆకాంక్షలు నెరవేరాలి
ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు

శ్రీ క్రోధి నామ సంవత్సరంలో జిల్లా ప్రజల కొత్త ఆశలు, ఆకాంక్షలు నెరవేరాలి. సుఖశాంతులతో ప్రజలు వర్ధిల్లాలి. పాత సంవత్సరంలో పూర్తి కాని లక్ష్యాలను కొత్త ఏడాదిలో సంపూర్ణంగా పూర్తిచేయడానికి యువత ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలి.

భద్రాద్రికి బ్రహ్మోత్సవ శోభ



విద్యుత్ దీపాల అలంకరణలో భద్రాద్రి రామాలయం

- శ్రీసీతారాముల కల్యాణానికి నేడు అంకురార్పణ
- పట్టాభిషేకానికి ఆహ్వానిస్తూ గవర్నర్‌కు రాజపత్రం అందజేత
- స్వామివారి కల్యాణానికి పోచంపల్లి పట్టువస్త్రాల తయారీ షురూ

భద్రాచలం, ఏప్రిల్ 8: దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచలం క్షేత్రంలో బ్రహ్మోత్సవ శోభ ఉట్టిపడుతోంది. శ్రీరామ నవమి సందర్భంగా శ్రీ సీతారాముల కల్యాణానికి మంగళవారం అంకురార్పణ నిర్వహించనున్నారు. మంగళవారం నుంచి 23వ తేదీ వరకు వసంతపక్ష ప్రయుక్త శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకొని మంగళవారం తెల్లవారుజామున 4గంటలకు సుప్రభాతసేవ నిర్వహించనున్నారు. మూలవరులకు అభిషేకం అనంతరం బేడా మండపంలో ఉత్సవమూర్తులకు ఉత్సవాంగ స్నపనంతో వసంతపక్ష బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. సాయంత్రం ఆరాధన, తిరువీధిసేవ, రామాలయంలో క్రోధినామ సంవత్సర సందర్భంగా పంచాంగ శ్రవణం చేయనున్నారు. ఇదిలా ఉండగా బ్రహ్మోత్సవాల నేపథ్యంలో నేటినుంచి 23వరకు నిత్యకల్యాణాలు నిలిపివేయనున్నారు. 9నుంచి మే ఒకటి వరకు పవళింపు సేవ, 9నుంచి 23 వరకు దర్బారు సేవలు నిలిపివేయనున్నారు. ఉగాదిని పురస్కరించుకొని స్వామివారికి కల్పవృక్ష వాహనసేవ నిర్వహించనున్నారు.

పట్టాభిషేకానికి గవర్నర్‌కు ఆహ్వానం..

భద్రాచలం దేవస్థానం ఆధ్వర్యంలో 18వ తేదీన నిర్వహించే శ్రీరామ మహాపట్టాభిషేకానికి రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను ఆహ్వానిస్తూ భద్రాద్రి దేవస్థానం అధికారులు రాజపత్రం అందజేశారు. భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి నేతృత్వంలో వైదిక పరిపాలన సిబ్బంది సోమవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు వేద ఆశీర్వచనం అందించిన అనంతరం మహాపట్టాభిషేకానికి ఆహ్వానిస్తూ వైదిక సిబ్బంది రాజపత్రం చదివి వినిపించారు. అనంతరం రాజపత్రాన్ని గవర్నర్ రాధాకృష్ణన్‌కు అందజేశారు.

రామయ్య కల్యాణానికి పట్టువస్త్రాల తయారీ

శ్రీరామనవమి సందర్భంగా భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణానికి పోచంపల్లి పట్టువస్త్రాల తయారీ ప్రారంభమైంది. సికింద్రాబాద్‌కు చెందిన చేనేత కళాకారులు ఎస్ఎస్ జయరాజ్, రాపోలు గణేష్, గుర్రం శ్రీనివాస్, మిరియాల సురేందర్‌లు భద్రాచలంలో ఇందుకు సంబంధించిన పనులకు శ్రీకారం చుట్టారు. గత రెండేళ్లుగా స్వామివారి కల్యాణాన్ని పురస్కరించుకొని వారు పోచంపల్లి పట్టు వస్త్రాలను దేవస్థానానికి అందజేస్తున్నారు.



గవర్నర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఈవో



శ్రీవెంకటేశ్వరస్వామి సన్నిధిలో పూజలు చేస్తున్న మంత్రి తుమ్మల

ద్వారకా తిరుమలలో మంత్రి తుమ్మల పూజలు

దమ్మపేట, ఏప్రిల్ 8: ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లా ద్వారకాతిరుమలలో సోమవారం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయ మర్యాదలతో తుమ్మలకు స్వాగతం పలికారు. అనంతరం తమ్మల వెంకటేశ్వరస్వామి సుప్రభాత సేవలో పాల్గొన్నారు. మంత్రి వెంట తుమ్మల శేషుబాబు, దొడ్డా ప్రసాదు, కసాని నాగప్రసాదు, నున్నా రత్నాకరరావు, సాయిబాబా తదితరులు ఉన్నారు.

వ్యవసాయ క్షేత్రాల పరిశీలన

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గండుగులపల్లి, లింగాలపల్లి గ్రామాల్లోని తనకు చెందిన వ్యవసాయ క్షేత్రాలను సోమవారం సందర్శించారు. కొబ్బరి, కోకో, పామాయిల్, మామిడి, వక్క తదితర పంటలను పరిశీలించారు.

తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రావొద్దు

- ముందస్తుగా అన్ని జాగ్రత్తలు చేపట్టాలి
- పంచాయతీరాజ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్
- తాగునీటి సరఫరాపై ఖమ్మం కలెక్టరేట్‌లో సమీక్ష

6

మధిరలో ఉగాది ఉత్సవాలకు డిప్యూటీ సీఎం భట్టి



మధిరటౌన్, ఏప్రిల్ 8: మధిరలో మంగళవారం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పర్యటించనున్నారు. ప్రతి సంవత్సరం ఉగాది తెలుగు ఏడాది పర్వదినాన్ని తన కుటుంబసభ్యులతో కలిసి మధిరలో జరుపుకొనే భట్టి విక్రమార్క ఆ ఆనవాయితీని కొనసాగించేలా బిజీ షెడ్యూల్ ఉన్నా నిర్ణయం తీసుకున్నారు. ఉగాది పండుగ కోసం భట్టి విక్రమార్క సోమవారం రాత్రే మధిరలోని తన క్యాంపు కార్యాలయానికి రానున్నారు. పండుగ కార్యక్రమాలను ముగించుకుని మంగళవారం మధ్యాహ్నం 3గంటలకు తిరిగి హైదరాబాద్ వెళ్లనున్నారు.

వేతనాల కోసం కార్మికుల ధర్నా

- ఆగ్రహంతో అద్దాలు పగులగొట్టిన వైనం
- ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఘటన

6



లోక్‌సభ ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

6

పోలింగ్ ఏర్పాట్లపై ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ సమీక్ష

ప్రజా దీవెనతోనే ఇందిరమ్మ రాజ్యం

- రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం
- లోక్‌సభ ఎన్నికల్లో భారీ మెజారిటీ అందించాలి
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న పొంగులేటి

వైరా, ఏప్రిల్ 8: కాంగ్రెస్ పార్టీనాయకులు, కార్యకర్తల కృషి, తెలంగాణ ప్రజల దీవెనలతో రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రైతు సంక్షేమమే ఈ ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించి కాంగ్రెస్‌ను ఘనమైన మెజారిటీతో గెలిపించాలని కోరారు. వైరాలో సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. అనంతరం తన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో పొంగులేటి మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ బీఆర్ఎస్ పాలనలోనే దెబ్బతిన్నదన్నారు. అందువల్లనే నీరు వృధాగా దిగువ ప్రాంతాలకు వదిలారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రంలో నీటి కొరత ఏర్పడిందన్నారు. రైతులను రెచ్చగొట్టి సానుభూతి పొందేందుకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని, దీన్ని రైతులు అర్థం చేసుకోవాలన్నారు రాష్ట్రంలో నీటి కొరత ఉన్నా సమస్యలను అధిగమిస్తామన్నారు. సాగర్ జలాలతో తాగునీటి చెరువులను నింపుతామన్నారు. బీఆర్ఎస్ పాలన కారణంగా రాష్ట్రం పదేళ్ల తీవ్రంగా దెబ్బతిన్నదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన నష్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం సరిచేసుకుంటూ పాలన సాగిస్తోందన్నారు. ప్రజల దీవెనలతో రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం అధికారంలోకి వచ్చిందని, ఈ ప్రభుత్వాన్ని దెబ్బతీసేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తుందని ఆరోపించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అవినీతి తప్ప అభివృద్ధి లేదన్నారు. సమావేశంలో వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే గెలుపు దిశా నిర్దేశకులు

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న నామా నాగేశ్వరరావు

రఘునాథపాలెం, ఏప్రిల్ 8: బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడు కార్యకర్తలనే నమ్ముకున్నందని, వారే పార్టీకి దిశా నిర్దేశకులని, తానెప్పుడు కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పనిచేశానని బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం రఘునాథపాలెం మండలం చిమ్మపూడిలో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకులు బూత్ లెవల్‌లో కంకణ బద్ధులై అందరూ కలిసి మెలిసి కీలకంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో తెలంగాణ ప్రజల గొంతుకగా ఉన్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులను గెలిపించటం ద్వారా పార్లమెంట్‌లో తెలంగాణ రాష్ట్రం హక్కులు కాపాడబడతాయని వివరించారు. ఖమ్మం నుంచి గతంలో గెలిచిన కాంగ్రెస్ ఎంపీలు జిల్లా అభివృద్ధికి పనిచేయలేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కార్యకర్తలే బలంగా నిలబడాలని కోరారు. ఎమ్మెల్సీ, జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు తాతా మధు మాట్లాడుతూ నామా నాగేశ్వరరావు అందరివాడని, ఆయన గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఉత్తమ పార్లమెంట్ అభ్యర్థిగా నామా గౌరవం దక్కించుకున్నారని తెలిపారు. వైస్ ఎంపీపీ గుత్తా రవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు వీరునాయక్, తాళ్లూరి జీవన్, కుర్రా భాస్కర్‌రావు, మద్దినేని వెంకటరమణ, హరిప్రసాద్, మెంటమ్ రామారావు, దొంతు సత్యనారాయణ, గోర్రె శ్రీను, నర్సయ్య, సైదులు, భద్రయ్య, కోటేశ్వరరావు, ముత్తయ్య, విజయారెడ్డి పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

● **కలెక్టర్ వీపీ గౌతమ్**

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 8: లోకసభ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఖమ్మం లోకసభ నియోజకవర్గ 7 సెగ్మెంట్ల సహాయ రిటర్నింగ్ అధికారులతో నామినేషన్ సహాయక కేంద్రాల ఏర్పాటు, పోస్టల్ బ్యాలెట్, ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్, పోలింగ్ సిబ్బందికి రెండో విడత శిక్షణ, ఓటర్ నమోదు, ఈవీఎం స్ట్రాంగ్ రూంల ఏర్పాటు, పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికలకు సంబంధించి కమిషన్ మార్గదర్శకాల ప్రకారం అన్ని ముందస్తు చర్యల్లో వేగం పెంచాలన్నారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో వీవీపీ ఓటర్లను మార్క్ చేయాలని ఓటర్ నమోదు జాబితాలో వారి పేరు లేకుంటే వెంటనే నమోదుకు చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల వారిగా 18 - 19 సంవత్సరాల వయస్సు యువత 4 శాతానికి తక్కువ ఉంటే, దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి నమోదులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సహాయక కేంద్రాన్ని ఏర్పాటుచేసి, పోటీచేసే అభ్యర్థి, ప్రపోజర్ల ఓటు హక్కు ఉన్నది లేనిది చూడడం, నామినేషన్ పత్రాల పూరించడం, జతచేయు పత్రాలపై అవగాహన కల్పించాలన్నారు. ఎన్ఐసీ పోర్టల్ నుంచి ఎవరు, ఎక్కడ పనిచేస్తున్నదీ నివేదిక తీసుకొని దాని ప్రకారం చర్యలు చేపట్టాలన్నారు. గత ఎన్నికలో హోమ్ ఓటింగ్ సౌకర్యం కల్పించిన వారికి తిరిగి కల్పించాలన్నారు. మే 3 నుంచి హోం ఓటింగ్ చేపట్టనున్నట్లు, దీనికి అన్ని చర్యలు చేపట్టాలన్నారు. సెగ్మెంట్లలో ఈవీఎంల భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూంలు ఏర్పాటు చేయాలని, పోస్టల్ బ్యాలెట్లు భద్రపర్చడానికి మండల స్థాయిలో భద్రతతో కూడిన స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటుచేయాలన్నారు. సువిధ అనుమతులు నిర్ణీత కాలవ్యవధిలోగా జారీచేయాలన్నారు. ఈ సమీక్ష లో శిక్షణ సహాయ కలెక్టర్ యువరాజ్, జడ్పీసీఈవో వినోద్, డీఆర్వో సన్యాసయ్య, జిల్లా ఉపాధికల్పన అధికారి కొండపల్లి శ్రీరామ్, కలెక్టరేట్ ఏవో అరుణ, పర్యవేక్షకులు మదన్‌గోపాల్, సత్యనారాయణ, మీనన్, అధికారులు తదితరులున్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్

ఎంఈవో, హెచ్ఎంల సస్పెన్షన్ ఎత్తివేత

ఖమ్మం ఖానాపురంహవేలి ఏప్రిల్ 8: ఖమ్మం జిల్లా తల్లాడ ఎంఈవో ఎస్.దామోదర్ ప్రసాద్, మల్సూర్‌తండా హెచ్ఎం అన్నపూర్ణ సస్పెన్షన్ ఎత్తివేస్తూ విద్యాశాఖ సోమవారం రాత్రి ఉత్తర్వులు విడుదల చేసింది. ఎంఈవో సస్పెన్షన్‌ను ఆర్జేడి సత్యనారాయణ, హెచ్ఎం సస్పెన్షన్‌ను డీఈవో సోమశేఖర శర్మ ఎత్తివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా తిరిగి వారిని అదే ప్రాంతాల్లో పోస్టింగ్‌లు ఇచ్చారు. కాగా మల్సూర్‌తండా పాఠశాలల్లో గ్రామ పంచాయతీ నిర్మాణంపై కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు ఈ నెల 2న ఇద్దరిని సస్పెన్షన్ చేశారు. నాలుగు రోజుల వ్యవధిలోనే సస్పెన్షన్‌ను ఎత్తివేయడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయనే వాదనలు వినపడుతున్నాయి. కలెక్టర్ ఆదేశాలతో సస్పెన్షన్‌కు గురైనా అధికారులను ఇంతలోనే ఎలా సస్పెన్షన్ ఎత్తివేశారో తెలియని పరిస్థితి. విధుల్లో చేరిన అనంతరం వీరిపై శాఖ పరమైన విచారణ కొనసాగుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి తెలిపారు.

భూవివాదంలో ముగ్గురిపై కేసు నమోదు

పాల్వంచ, ఏప్రిల్ 8: భూ వివాదంలో పాల్వంచ రూరల్ పోలీసులు సోమవారం ముగ్గురిపై కేసు నమోదు చేశారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లాకు చెందిన దాసరి పద్మకు పాల్వంచ మండలం జగన్నాథపురంలో కొంత భూమి ఉంది. ఈ నెల 1న తన భూమిని రెవెన్యూ అధికారుల చేత సర్వే చేయిస్తుంది. ఈ క్రమంలో పనిలో సహకరించడానికి ఆమె చెల్లి కుమారుడు గాదే శివకుమార్ తన స్నేహితుడు శ్రీనుతో కలిసి అక్కడికి చేరుకున్నాడు. కానీ అప్పటికే ఆ భూమి తమదంటూ అదే గ్రామానికి చెందిన యాకూబ్, మంజూర్, రుక్మద్దీన్‌లు ఆ భూమి నుంచి వెళ్లి పోవాలంటూ ఆమెను బెదిరించారు. అంతటితో ఆగకుండా వారు వారిపై భౌతిక దాడికి పాల్పడ్డారు. దీంతో శివకుమార్ ఫిర్యాదు మేరకు యాకూబ్, మంజూర్, రుక్మద్దీన్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

కమీషన్ల కోసమే సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణం

● **రౌండ్ టేబుల్ సమావేశంలో వామపక్ష రైతు సంఘాలు, ప్రజాసంఘాల డిమాండ్**



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పొన్నం వెంకటేశ్వరరావు

ఖమ్మం సంక్షేమవిభాగం, ఏప్రిల్ 8: కొన్ని ప్రభుత్వాలు కమీషన్లు కోసం, మరి కొన్ని ప్రభుత్వాల్లో నాయకులు వ్యక్తిగత కీర్తి కోసమే సాగునీటి ప్రాజెక్టులు రూపకల్పన చేసి మధ్యలో నిలిపివేస్తున్నారని వామపక్ష రైతు సంఘాల నాయకులు ఆరోపించారు. సోమవారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో మంచికంటి భవన్‌లో సాగునీటి ప్రాజెక్టులు-ఉమ్మడి జిల్లాలో శాశ్వత పరిష్కారం అనే అంశంపై రౌండు టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసి నాగార్జున సాగర్ ఆయకట్టుకు సాగు నీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దుమ్ముగూడెం ప్రాజెక్టు సాధన కోసం ఆ నాటి ఖమ్మం ఎంపీగా ఉన్న తమ్మినేని వీరభద్రం మహాప్రస్థానం వంద రోజులు పాదయాత్ర చేశారన్నారు. వామపక్ష పార్టీలు అనేక ఉద్యమాలుచేశాయన్నారు. 2005నుంచి 2014వరకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నా పూర్తి చేయలేక పోయిందని ఆరోపించారు. గోదావరి జలాలను సీతారామప్రాజెక్టుకు అనుసంధానం జరగడం ద్వారానే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగునీటి సమస్య పరిష్కారం జరుగుతుందని, ఆ మేరకు జిల్లాలోని ముగ్గురు మంత్రులు బాధ్యత తీసుకోవాలని తీర్మానించారు. ఇందిరాసాగర్, రాజీవ్‌సాగర్, దుమ్ముగూడెం, జాలిముడి, సీతారామ ప్రాజెక్టులు ఇలా ప్రభుత్వాలు మారుతన్న ప్రతి సారి సాగునీటి ప్రాజెక్టులు మారుతున్నాయి కానీ ఉమ్మడి జిల్లాలో సాగునీటి సమస్య పరిష్కారానికి ఒక్క ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిర్మాణం పూర్తి కాలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వామపక్ష రైతు సంఘాల నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా బాధ్యులు బొంతు రాంబాబు, మాదినేని రమేశ్, పొన్నం వెంకటేశ్వరరావు, దొండపాటి రమేశ్, మాచర్ల భారతి, మురరుళి, తాతా భాస్కర్‌రావు, దుగ్గి కృష్ణ, చింతనిప్పు చలపతిరావు, వాసిరెడ్డి ప్రసాద్, బోడేపూడి వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి

మల్టీజోన్-1 ఐజీపీ ఏవీ రంగనాథ్

ఖమ్మంక్రైం, ఏప్రిల్8: గంజాయిరవాణా, విక్రయాలపై పటిష్ఠ చర్యలు తీసుకోవాలని మల్టీజోన్ ఐజీపీ ఏవీ రంగనాథ్ అన్నారు. గంజాయి నియంత్రణపై ఐజీపీ సోమవారం వివిధ జిల్లాల పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ డిస్ట్రిక్, స్టేట్ సరిహద్దు రాష్ట్రాల పోలీసు అధికారుల సమన్వయం, సమాచార మార్పిడితో గంజాయి అక్రమ రవాణాను అడ్డుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలో 2021లో రవాణా చేస్తున్న పట్టుబడిన 170 కేజీల గంజాయి కేసులో పకడ్బందిగా చార్జిషీటుతో నలుగురికి 20 ఏళ్ల జైలుశిక్ష, జరిమానా పడేలా చేసిన జిల్లా పోలీసులను ఐజీపీ అభినందించారు. ఈసమావేశంలో ఏడీసీపీలు ప్రసాదరావు, నరేష్‌కుమార్, ఏసీపీలు రమణమూర్తి, బోజరాజు, మల్లయ్య, పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న పోలీసులు

రూ.151కే భద్రాద్రి రామయ్య తలంబ్రాలు



డీఎంకు రసీదు అందిస్తున్న కార్గో ఇన్‌చార్జి మునీర్

సత్తుపల్లి, ఏప్రిల్8: భద్రాచలంలో ఈనెల 17న జరిగే శ్రీరామనవమి సందర్భంగా అక్కడికి వెళ్లలేని భక్తుల సౌకర్యార్థం టీఎస్ఆర్టీసీ అందిస్తున్న గొప్ప సదవకాశం రూ.151కే భద్రాద్రి రామయ్య తలంబ్రాలు. సోమవారం సత్తుపల్లిలోని ఆర్టీసీ డీఎం కార్యాలయంలో ఇందుకు సంబంధించి పోస్టర్లను డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేరుగా ఇంటికే వద్దకే తలంబ్రాలను కార్గో ద్వారా ముత్యాల తలంబ్రాలను అందిస్తున్నట్లు డీఎం చెప్పారు. ఇతర వివరాలకు సత్తుపల్లి డిపో లాజిస్టిక్స్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ మునీర్‌పాషా 91542 98585ను సంప్రదించాలని కోరారు. తొలుత బుకింగ్ చేసుకున్న డీఎంకు రసీదును అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ విజయశ్రీ, ఉద్యోగులు రాములు, బాబురావు, పీపీ.రావు, కిరణ్‌బాబు, ఆనందరావు పాల్గొన్నారు.

సీతారామ లింక్ కేనాల్ నిర్మాణానికి సహకరించాలి

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(భూసేకరణ) ఎం.రాజేశ్వరి



సమావేశంలో పాల్గొన్న అధికారులు, రైతులు

ఏన్కూర్ ఏప్రిల్ 8: సీతారామ ఏన్కూరు లింక్ కెనాల్ నిర్మాణానికి రైతులు సహకరించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(భూసేకరణ)ఎం.రాజేశ్వరి కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో రైతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె భూసేకరణపై అభ్యంతరాలను కోరగా రైతులు ముక్తకంఠంతో వ్యతిరేకించారు. ప్రాజెక్టుకు భూమి ఇచ్చే ప్రసక్తేలేదని తేల్చిచెప్పి, కొంత సేపు ఆందోళన చేశారు. ప్రాజెక్టు నిర్మాణాన్ని అడ్డుకుంటామని, పాజెక్టు నిర్మాణానికి భూమిఇచ్చే ప్రసక్తేలేదని అన్నారు. పాత సర్వే ప్రకారం రాజలింగాల సమీపంలో నిర్మించాలని సూచించారు. చివరకు సమావేశం ఏకాభిప్రాయానికి రాకపోవడంతో అర్ధాంతరంగా సమీక్ష ముగిసింది. ఈ సమావేశంలో ఎస్ఈ శ్రీనివాస్ రెడ్డి, సీఈ శ్రీనివాసరెడ్డి, ఈఈ అర్జున్, డీఈ చంద్రశేఖర్, తహసీల్దార్ సీహెచ్.శేషగిరిరావు, రైతులు పాల్గొన్నారు.

తనిఖీలతో చట్టవ్యతిరేక కార్యకలాపాల కట్టడి

● **సీపీ సునిల్‌దత్**



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

ఖమ్మంక్రైం, ఏప్రిల్8: చట్టవ్యతిరేక కార్యకలాపాలను కట్టడి చేసేందుకు పోలీసు యంత్రాంగం జిల్లాలో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు రాష్ట్రాల మీదుగా గంజాయి, రేషన్‌బియ్యం, ఇసుక వంటి అక్రమ రవాణాను అరికట్టేదుకు వాహనాల తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన, ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలపై జరిమానాలతో పాటు ర్యాష్‌డ్రైవింగ్, మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేస్తున్నారని తెలిపారు. అదేవిధంగా దొంగతనాలు జరగకుండా పాత నేరస్తులను కదలికలను కట్టడి చేసేలా అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారన్నారు.

వరుసకు కూతురు అయ్యే మైనర్‌పై వేధింపులు

● **వ్యక్తిపై పోక్సో కేసు**

మధిరటౌన్, ఏప్రిల్8: బాలికను వేధించిన ఓ వ్యక్తిపై పోలీసులు సోమవారం పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఖమ్మం జిల్లా మధిర మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు రోడ్డులో నివాసముంటున్న మల్ల కార్తీక్ వరసకు కూతురు అయ్యే మైనర్‌ను తరుచూ వేధిస్తున్నాడు. దీంతో బాలిక మధిర టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అతడిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. భర్తతో విడిపోయిన ఓ మహిళ కొంతకాలం క్రితం మధిరకు చెందిన కార్తీక్‌ను వివాహం చేసుకొని తన మొదటి భర్తతో కలిగిన కూతురుతో కలిసి జీవిస్తోంది. పదో తరగతి చదివే ఆ బాలికను కొంతకాలంగా కార్తీక్ లైంగికంగా వేధిస్తుండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. టౌన్ ఎస్.ఐ సంధ్య బాలిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసి రిమాండ్‌కు తరలించారు.

సుజాతనగర్ ఎంపీపీగా పద్మావతి ఎన్నిక



ధ్రువీకరణ పత్రాన్ని చూపిస్తున్న ఎంపీపీ భూక్యా పద్మావతి

సుజాతనగర్, ఏప్రిల్ 8 : సుజాతనగర్ ఎంపీపీ పీఠాన్ని సీపీఐ కైవసం చేసుకుంది. సుజాతనగర్ మండల పరిషత్ అధ్యక్ష ఎన్నికలు సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. గతంలో ఎంపీపీగా ఉన్న భూక్యా విజయలక్ష్మిపై ఎంపీటీసీలు గత నెల అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. కాగా ఎంపీపీ ఎన్నిక కోసం ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎన్నికను అధికారులు నిర్వహించారు. 8 మంది ఎంపీటీసీలకు గాను 7మంది ఎంపీటీసీలు ఎంపీపీ ఎన్నికకు హాజరయ్యారు. ఎంపీపీ పదవికి సీపీఐ పార్టీకి చెందిన ఎంపీటీసీ భూక్యా పద్మావతి ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఆమెను ఎంపీపీగా నియమిస్తూ అధికారులు నియామక ధ్రువీకరణ పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారిగా డి.రమేష్, ఎంపీడీఓ టి.వెంకటలక్ష్మి పాల్గొన్నారు. ఎంపీపీగా ఎన్నికైన భూక్యా పద్మావతికి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శుభాకాంక్షలు తెలిపారు.

రిజర్వ్ ఫారెస్టులో చెట్ల నరికివేతపై డీఎఫ్‌వో ఆగ్రహం

దుమ్ముగూడెం ఏప్రిల్ 8: దుమ్ముగూడెం అటవీరేంజి పరిధి సుజ్ఞానపురం బీటు కంపార్ట్‌మెంట్ 125లో రిజర్వ్ ఫారెస్ట్ భూముల్లో భారీగా చెట్ల నరికివేతపై జిల్లా అటవీశాఖ అధికారి కృష్ణయ్యగౌడ్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఈనెల 8న అడవిలో అక్రమార్కులు అనే కథనం ఆంధ్రజ్యోతిలో వెలువడిన విషయం తెలిసిందే. నరికివేసిన కర్రలను వెంటనే డిపోకు తరలించి కేసు నమోదు చేయాలని రేంజి అధికారిను ఆదేశించినట్లు సమాచారం. దీంతో సుజ్ఞానపురం బీటు సిబ్బంది నరికివేసిన మారుజాతి కర్రలను డిపోకు తరలించే ఏర్పాట్లలో ఉన్నారు. దీనిపై టాస్క్‌ఫోర్స్ రేంజి అధికారి ప్రసాదరావును వివరణ కోరగా, ఒకటి రెండు రోజుల్లో పూర్తి స్థాయి విచారణ జరుపుతానని తెలిపారు. ఐతే రిజర్వ్‌ఫారెస్ట్ ఆక్రమణ కోసం ముందుగా చెట్లను నరికి ఆపై పోడు సాగు చేయడం ఆనవాయితీగా మారింది. కొందరు అటవీశాఖ సిబ్బంది ఎంతో కొంత ముడుపులు తీసుకొని ఈ అక్రమ సాగును ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. నరికిన చెట్ల విలువ సుమారు రూ.32వేల పైగా ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు.

10న ప్రేరణ జిల్లా స్థాయి ఎంపికలు

ఖమ్మం ఖానాపురంహవేలి ఏప్రిల్ 8: ప్రేరణ జిల్లా స్థాయి విద్యార్థుల ఎంపికలు ఈ నెల 10న జిల్లా నవోదయ విద్యాలయం, పాలేరులో జరుగుతాయని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రేరణకు ఎంపికైన విద్యార్థులను గుజరాత్ రాష్ట్రంలోని మోహసానా జిల్లా వాద్నగర్లోని వెర్నాక్యులర్ పాఠశాలలో పరిసర ప్రాంతాల్లో పురావస్తు, చారిత్రక కట్టడాలకు తీసుకెళ్తారని పేర్కొన్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో 9 నుంచి 12 వరకు చదివే విద్యార్థులు ఈ ఉత్సవంలో పాల్గొనేందుకు అర్హులు. ఇప్పటికే పాఠశాల స్థాయి ఎంపిక పూర్తి చేశారు. వీరికి ఈనెల 10 వికసిత భారతం, సమాజానికి, దేశానికి నా యొక్క చేయూత అనే అంశాలపై పోటీ నిర్వహించనున్నారు. నోడల్ అధికారి, ప్రిన్సిపాల్ నవోదయ విద్యాలయం పర్యవేక్షణలో పోటీలు జరుగుతాయని తెలిపారు. ఇందులో ప్రతిభ చూపిన 30 మంది(బాలురు, బాలికలు)విద్యార్థులను వ్యక్తిగత ఇంటర్వ్యూలకు ఎంపిక చేస్తారు. జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు ప్రేరణ ద్వారా ప్రేరణకు ఎంపికవుతారని తెలిపారు. ఎంపికైన వారికి వారం రోజులపాటు గుజారాత్ వాద్నగర్‌లో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు.

'తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రావొద్దు'

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 8: 'తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఉండొద్దు.. ఎక్కడైనా లోపాలు ఉంటే గుర్తించండి.. వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలి. ముందస్తుగానే సమస్యను గుర్తించి అన్ని జాగ్రత్తలు చేపట్టాలి.' అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా ఆదేశించారు. ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఆర్‌డబ్ల్యూఎస్, నీటిపారుదల, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో తాగునీటి సరఫరాపె ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చివరి ఆవాసం వరకు తాగునీరు అందేలా పటిష్ట కార్యాచరణ చేపట్టాలన్నారు. పాలేరు వైరా, దుమ్ముగూడెం రిజర్వాయర్‌లలో రాబోయే 3నెలలకు సరిపోయేన్ని నీటి నిల్వలు ఉన్నాయన్నారు. ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఉండొద్దన్నారు. అన్ని మోటార్లు కండీషన్‌లో ఉంచాలన్నారు. ఏదైనా కారణంతో మిషన్ భగీరథ నీళ్లు రాకపోతే, స్థానిక వనరులను ప్రత్యామ్నాయంగా ఉంచాలన్నారు. బోర్‌వెల్స్, హ్యాండ్‌పంపులు పనిచేసేలా చూడాలన్నారు. సమస్యలను గుర్తించి పరిష్కరించడంలో స్థానిక అధికారులు ముందుండాలన్నారు. పాలేరుకు వచ్చిన నీటి పంపిణీలో అధికారులు సమన్వయంతో వ్యవహరించాలన్నారు.

ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ మాట్లాడుతూ సాగర్ నుంచి నీరు విడుదల చేసినందుకు జిల్లా ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. నీటి సరఫరాలో లోపాలు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశానికి ముందు ప్రిన్సిపల్ కార్యదర్శి, జిల్లా కలెక్టర్‌తో కలిసి వైరా రిజర్వాయర్ ఇంటెక్‌వెల్ పరిశీలించారు. అనంతరం దానవాయిగూడెం చెక్ డ్యామ్‌ను పరిశీలించారు. సమీక్ష సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి, శిక్షణ సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

స్త్రీనిధి వసూళ్లలో బుక్ కీపర్ చేతివాటం

రూ.4.40లక్షలు స్వాహా

దుమ్ముగూడెం ఏప్రిల్ 8: స్త్రీనిధి రుణాల వసూళ్లలో బుక్‌కీపర్ చేతివాటం ప్రదర్శించిన విషయం సోమవారం ఆలస్యంగా వెలుగుచూసింది. స్వాహా చేసిన దాంట్లో కొంత సొమ్మును బుక్ కీపర్ నుంచి సెర్ఫ్ సిబ్బంది రికవరీ చేయగా, మిగతా భాగాన్ని కూడా త్వరలోనే చెల్లిస్తానని ఒప్పంద పత్రం రాసిచ్చింది. ఐతే ఇదే కోవలో అచ్యుతాపురం, లక్ష్మీనగరంలోని గ్రామసమాఖ్యలకు సంబంధించిన స్త్రీ నిధి వసూళ్ల రూ.లక్షలను బుక్ కీపర్లు మింగేసినట్లు ఆరోపణలు వినబడుతున్నాయి. కాశీనగరంలోని ఓ గ్రామసమాఖ్యకు చెందిన 10మంది సభ్యులు మండల సెర్ఫ్ ద్వారా రూ.10లక్షల స్త్రీనిధి రుణం తీసుకున్నారు. ఒక్కొక్కరు నెలకు రూ.2,200లు చొప్పున 24 నెలలు రుణ వాయిదాలు చెల్లించాల్సి ఉంది. తీసుకున్న రుణం త్వరగా తీరాలనే ఉద్దేశ్యంతో ఒక్కొక్క సభ్యురాలు నెలకు రూ.5వేల చొప్పున 17 నెలల పాటు చెల్లిస్తూ వస్తున్నారు. ప్రతీ నెలా సమాఖ్య సభ్యులు చెల్లించిన రూ.50వేలకు బదులుగా రూ.22వేలను మాత్రమే సంబంధిత బుక్ కీపర్ స్త్రీనిధి ఖాతాకు జమ చేస్తూ వస్తోంది. వసూళ్ల విషయమై అనుమానం వచ్చిన సంబంధిత సెర్ఫ్ సీసీ కాశీనగరం గ్రామసమాఖ్యకు సంబంధించిన స్త్రీనిధి లెక్కలు చూడగా, అసలు విషయం వెలుగులోకి వచ్చింది. రూ.4.37వేలను స్త్రీనిధి ఖాతాకు చెల్లించకుండా బుక్ కీపర్ తన సొంతానికి వాడుకున్నట్లు అంగీకరించింది. స్వాహా చేసిన డబ్బులను తిరిగి చెల్లిస్తానని ఒప్పంద పత్రం కూడా రాసిచ్చినట్లు సమాచారం. ఒక విడతగా ఇప్పటికే రూ.1.70లక్షలను బుక్‌కీపర్ స్త్రీ నిధి ఖాతాకు చెల్లించగా, ఇంకా రూ2.67లక్షలను త్వరలోనే చెల్లిస్తానని రాతపూర్వకంగా అంగీకరించిందని తెలిసింది. ఐతే ఇదే కోవలో లక్ష్మీనగరం, అచ్యుతాపురంలకు చెందిన రెండు గ్రామసమాఖ్యలకు సంబంధించి వసూలైన రూ.లక్షల స్త్రీనిధి రుణాలను చెల్లించకుండా సదరు బుక్ కీపర్లు తమ సొంతానికి వాడుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయమై సీసీను వివరణ కోరగా, స్వాహా జరిగిన విషయం నిజమేనని, రికవరీ జరుగుతోందని తెలిపారు.

15న ఐదు రాష్ట్రాల్లో మావోయిస్టుల బంద్

చర్ల, ఏప్రిల్ 8: అడవుల్లో జరుగుతున్న ఎన్‌కౌంటర్లను నిరసిస్తూ ఈనెల 15న తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల్లో బంద్ నిర్వహించనున్నట్లు మావోయిస్టు పార్టీ సెంట్రల్ రీజినల్ బ్యూరో, సెంట్రల్ కమిటీ ప్రతినిధి ప్రతాప్ పేరిట సోమవారం లేఖ విడుదల చేశారు. గత ఐదు దశాబ్దాలుగా త్యాగాలతో ఉద్యమం నడుస్తోందన్నారు. ఇదిలా ఉండగా సుకుమా జిల్లా కిష్టారం పరిధిలోని తొండమార్క, డబ్బమార్క అడవుల్లో రెండు చోట్ల మావోయిస్టులకు సంబంధించిన డంప్‌ని స్వాధీనం చేసుకుని, ఆరుగురు మావోయిస్టులను అరెస్టు చేసి నట్లు సుకుమా జిల్లా పోలీసులు తెలిపారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

కారేపల్లి, ఏప్రిల్8: మండల పరిధిలోని కొమ్ముగూడెం గ్రామంలో ఉగాది పండుగ సందర్భంగా నిర్వహిస్తున్న రెండు జిల్లాల స్థాయి కబడ్డి పోటీలను గ్రామ మాజీ సర్పంచ్ కల్లి భద్రమ్మ ప్రారంభించారు. మొదటి బహుమతి రూ.20 వేలు, రెండో బహుమతి రూ.16వేలు, తృతీయ బహుమతి రూ.12వేలు, నాల్గో బహుమతి రూ.8వేలు, ఐదో బహుమతి రూ.ఐదు వేలు అందజేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్

పాల్వంచ, ఏప్రిల్8: అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పాల్వంచ టౌన్ పోలీసులు సోమవారం సీజ్ చేశారు. పట్టణ పరిధిలోని ముర్రేడువాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను దమ్మపేటలో పట్టుకుని పాల్వంచ టౌన్ స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు టౌన్ ఎస్ఐ బానాల రాము తెలిపారు.

నేటి నుంచి జమలాపురం వేంకటేశుడి బ్రహ్మోత్సవాలు



ముస్తాబైన వేంకటేశ్వరస్వామి ఆలయం

ఎర్రుపాలెం, ఏప్రిల్ 8: ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలోని జమలాపురంలో కొలువైన శ్రీవెంకటేశ్వరస్వామి వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రతీ సంవత్సరం నిర్వహించే క్షేత్ర సంప్రదాయమైన రుగ్వేద వైదిక స్మార్త ఆగమము శాస్త్ర ప్రకారం క్రోధి నామ సంవత్సర చైత్రశుద్ధ పాడ్యమి(ఉగాది) నుంచి చైత్రశుద్ధ నవమి(శ్రీరామనవమి) ఏప్రిల్ 17 వరకు 9 రోజులపాటు శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఇప్పటికే ఆలయానికి రంగులు, విద్యుత్ దీపాలతో అలంకరించి సిద్ధంచేశారు. ఆలయ ఆవరణంలో ఆకర్షణీయమైన రంగవల్లులను తీర్చిదిద్దారు. ఈ తొమ్మిది రోజులు వివిధ రకాల జప, అర్చన, హోమాది కార్యక్రమాలతో పాటు రోజుకొక వాహన సేవనుకూడా నిర్వహించనున్నారు. ఏప్రిల్ 15వ తేదీన శ్రీవారిని పెండ్లికొడుకుగా, శ్రీదేవి, భూదేవి పెళ్లికూతురుగా భావించి, ఎదుర్కోలు ఉత్సవం నిర్వహిస్తారు.

వన్యప్రాణులను వేటాడే ముఠాపై విజిలెన్స్ విచారణ

తల్లాడ, ఏప్రిల్8: తల్లాడ ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని కనకగిరి అటవీ ప్రాంతంలో వన్యప్రాణులను వేటాడేందుకు వచ్చిన ఆరుగురు ముఠా సభ్యుల విషయమై హైదరాబాద్ విజిలెన్స్ డీఎఫ్‌ఓ ముకుంద్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రాథమిక విచారణ నిర్వహించారు. ఆదివారం తల్లాడ ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో సత్తుపల్లి ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ వాడపల్లి మంజులతో పాటు ఫారెస్ట్ అధికారులను ప్రాథమికంగా విచారించి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో డీఆర్వో శ్రీను, ఎఫ్‌బీవోలు లావణ్య, నాగరాజు పాల్గొన్నారు.

భద్రాచలంలో 25 కేజీల గంజాయి పట్టివేత

భద్రాచలం, ఏప్రిల్ 8: భద్రాచలంలోని ట్యాక్సీ స్టాండు సమీపంలో సోమవారం అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను భద్రాచలం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు వారిని వివరాలు అడగ్గా, పొంతనలేని సమాధానం చెప్పడంతో వారి బ్యాగ్‌లను తనిఖీ చేశారు. దీంతో అందులో ఐదు ప్యాకెట్లలో నిల్వ ఉంచిన ఎండు గంజాయి పట్టుబడినట్లు తెలిసింది. సుమారు 25 కేజీల గంజాయిని ఆ ఇరువురి నుంచి స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఈ విషయమై అధికారికంగా పోలీసులు ఎటువంటి ప్రకటన చేయలేదు.

వేతనాల కోసం కార్మికుల ధర్నా

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 8: మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో కార్మికులు ధర్నాకు దిగారు. అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ విధులను బహిష్కరించి ఆందోళనకు దిగారు. ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రిలో సోమవారం పేషంట్‌కేర్స్, పారిశుధ్య కార్మికులు ఆందోళన చేపట్టారు. జనవరి నుంచి మూడు నెలలెగా వేతనాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఆస్పత్రిలో ఓ ప్రైవేటు ఏజెన్సీ ద్వారా 259 మంది కార్మికులు పేషెంట్ కేర్, పారిశుధ్యం కార్మికులు, సెక్యూరిటీ గార్డులుగా విధులు నిర్వహిస్తున్నారు. గత ఏడాది నుంచి కార్మికులకు వేతనాలు చెల్లింపుల్లో తీవ్రంగా కోత విధించడంతో పాటు మూడు నెలలుగా వేతనాలు లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే జిల్లా ఆస్పత్రిలో వైద్య విధాన పరిషత్ కింద ఉన్నప్పుడు 575 పడకలకు సరిపడిన కార్మికులుగా 259 మందికి వేతనాలు ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం డీఎం ఈ పరిధిలోకి వెళ్లడంతో రాష్ట్ర వ్యాప్తంగా 2వ విడతలో మంజూరైన వైద్యకళాశాలల వరుసలో ఖమ్మం ఉందని, దీనికి కేవలం 435 పడకల సామర్థ్యానికే నిధులు వస్తుండడంతో వేతనాల్లో కొరత పడుతుందని తెలిసింది. దీంతో ప్రతి నెలా ఏజెన్సీ నుంచి డబ్బులు జమ చేసి కార్మికులకు వేతనాలు సర్దుబాటు చేస్తున్నారు. ఈనేపథ్యంలో సోమవారం కూడా రెండు నెలల వేతనాల కింద రూ.70 లక్షలు వచ్చాయని అధికారులు చెబుతున్నారు. కానీ కార్మికులకు రావాల్సింది రూ.కోటి 55 లక్షలు రావాల్సి ఉంది. ఏజెన్సీ కాంట్రాక్టర్ తాను ఇంత పెద్దమెత్తాన్ని చెల్లించలేనని చేతులెత్తేశారు. అధికారులు కూడా ఈ విషయమై రాష్ట్ర ఉన్నతాధికారులకు వివరించారు. ఈ లోగా విడుదలైన రూ.70లక్షలను కార్మికులకు సర్దుబాటు చేయాలని సూచించారు. అయితే కార్మికుల ఆగ్రహంతో పార్టేషన్ అద్దాలను పగుల గొట్టారు. కార్మికుల పక్షాన ఐఫ్టూ నాయకులు రామయ్య, సీఐటీయూ నాయకులు విష్ణు అధికారులతో సంప్రదింపులు జరిపారు. వచ్చే నెలాఖరు నాటికి ఈ సమస్యకు ఒక పరిష్కారాన్ని చూపుతామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు తెలిపారు.



వేతనాల కోసం జిల్లా జనరల్ ఆస్పత్రిలో ధర్నా చేస్తున్న కార్మికులు

కూలర్ శుభ్రం చేస్తుండగా.. విద్యుదాఘాతంతో యువకుడి మృతి



షోయబ్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఏప్రిల్8: ఇంట్లో కూలర్ శుభ్రం చేస్తుండగా ప్రమాదవ శాత్తు విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణంలో సోమవారం చోటు చేసుకుంది. పట్టణంలోని రామవరం ప్రాంతంలోని 7 నెంబర్ బజార్‌లో ఎస్.డి.షోయబ్(28) కూలర్ శుభ్రం చేస్తూ వాటర్ మోటార్ సహాయంతో కడుగుతుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే స్థానికులు అతడిని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపాడు. కొత్తగూడెం టూటౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

దుమ్ముగూడెం ఏప్రిల్8: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి పైడిగూడేనికి చెందిన కంగాల గంగరాజు(38) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈనెల 30న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చింతూరుకు తన సోదరుడు కన్నయ్యతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్లి ఇంటికి వస్తుండగా మారాయిగూడెం గ్రామ శివారులో ఎదురుగా ద్విచక్రవాహనంపై వస్తున్న మోకాళ్ల శ్రీకాంత్ అనే వ్యక్తి వీరిని ఢీకొట్టడంతో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన అతడిని హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ గణేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో బాలిక...



సౌమ్య

కరకగూడెం, ఏప్రిల్8: అనారోగ్యంతో బాలిక మృతి చెం దిన సంఘటన కరకగూడెంలో జరిగింది. కుటుంబ సభ్యు లు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని ఎలిపెద్ది శ్యాంసుందర్, అనుష దంపతుల కుమార్తె సౌమ్య (8) కొన్ని రోజులుగా జ్వరంతో ఇబ్బందులు పడుతుండగా ఇటీవల హైదరాబాద్‌లోని నిరో వైద్యశాలలో చేర్పించారు. ఆదివారం జ్వరంతో పాటు కామెర్లు ఎక్కువగా కావడంతో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందినట్లు వైద్యులు తెలిపినట్లు తెలిపారు. చిన్నారి మృతితో కరకగూడెం విషాదఛాయలు అలుముకున్నాయి.

రెండు రేషన్ షాపులు సీజ్

తల్లాడ, ఏప్రిల్8: తల్లాడ మండలం మిట్టపల్లిలోని రెండు చౌక ధరల దుకాణాలలో పీడీఎస్ బియ్యం నిల్వల్లో వ్యత్యాసాన్ని గుర్తించి పౌర సరఫరాల శాఖ అధికారులు సీజ్ చేశారు. సత్తుపల్లి సివిల్ సప్లయ్ డీటీ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఓ రేషన్ దుకాణంలో 12.64క్వింటాళ్ల బియ్యం నిల్వలో అధికంగా ఉండటం, మరో రేషన్ దుకాణంలో 13.10క్వింటాళ్లు తక్కువ నిల్వలు ఉండటంతో 6(ఏ) కేసు నమోదు చేసి రేషన్ షాప్‌ను సీజ్ చేశారు. రెండో రేషన్ షాపులలో నిల్వ ఉన్న 126క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేశారు.

నేటినుంచి శ్రీ అభయ వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

ఖమ్మం ఖానాపురంహవేలి, ఏప్రిల్ 8: ఖమ్మం నగర కార్పొరేషన్ 4వ డివిజన్ పరిదిలోని యూసీహెచ్ కాలనీలోని స్వయంభూ శ్రీ అభయ వెంకటేశ్వర స్వామి ఆలయ 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ఉగాది పర్వదినం నుంచి ప్రారంభమవుతాయి. మంగళవారం అంకురార్పణ, ధ్వజారోహణ, 10న మూలవరులకు అష్టోత్తర శతకలశస్రపన (108 కలశాలతో అభిషేకం), 11న స్వామి వారి కల్యాణం, సాయంత్ర ఊరేగింపు, 12న సుదర్శనహోమం, మహాశాంతి హోమం, 13న మహాపుష్పాభిషేకం, అనంతరం మహా అన్నదానం, రాత్రికి పవళంపు సేవ నిర్వహించనున్నారు. ఉగాది పండుగ, బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో, వివిధ రకాల పూలతో అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండ ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఆలయ అధ్యక్షుడు బొల్లి కొమరయ్య, ప్రధాన కార్యదర్శి పురం తిరుపయ్య, కోశాధికారి బానోత్ మల్సూర్ నాయక్ తెలిపారు.

అర్హులందరికీ పక్కా గృహాలు

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ఏన్కూరు, వైరా మండలాల్లో

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఏన్కూరు/వైరా ఏప్రిల్ 8: అర్హులైన పేదలందరికీ పక్కా గృహాలు మంజూరు చేస్తానని రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కేసుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు శెట్టిపల్లి సురేష్ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం నాచారంలో ముక్తి నారాయణ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం కొంతమంది పక్కా గృహాలు గురించి మంత్రి దృష్టికి తీసుకెళ్లగా పై విధంగా స్పందించారు. ఎవరు అధైర్యపడాల్సిన అవసరంలేదని ప్రతి ఒక్కరికి దశల వారీగా మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి కృషిచేస్తుందన్నారు ఏన్కూరు, కారేపల్లి మండలాలకు చెందిన పలువురు పలు సమస్యలపై వినతిపత్రాలు అందించారు కార్యక్రమంలో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, మాజీ మార్క్‌ఫెడ్ రాష్ట్ర వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ ముక్తి వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు స్వర్ణ నరేంద్రకుమార్, ఏబ్లాక్ అధ్యక్షుడు వేముల కృష్ణప్రసాద్, కేసుపల్లి నాచారం మాజీ సర్పంచ్‌లు బానోతు నాగమణి, వర్షా రాంబాబు, నాయకులు వాసిరెడ్డి నాగేశ్వరరావు, స్వర్ణ ప్రహ్లాదరావు, గిద్దగిరి సత్యనారాయణ, నల్లమల శివకుమార్, ఉప్పెర్ల ఆనందప్రసాద్, కట్టా సత్యనారాయణ, మేడా ధర్మారావు, భూక్యా లాలునాయక్, దళపతి భువనేశ్వరరాజు, పూర్ణకంటి మైసారావు, రాయల పుల్లయ్య, తాళ్లూరి నరవీన్, ముక్తి లక్ష్మీనారాయణ, యంద్రాతి సాయి రోహిత్, జెర్రిపోతుల సుందరావు పాల్గొన్నారు.


వరలక్ష్మీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పొంగులేటి

బాధిత కుటుంబాలకు మంత్రి పరామర్శ

వైరా: వైరాలో పలు బాధిత కుటుంబాలను సోమవారం రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పరామర్శించారు. వైరా మునిసిపలిటీ ఏడోవార్డు బ్రాహ్మణపల్లిలో ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన పణితి వరలక్ష్మీ కుటుంబసభ్యులైన కుమారుడు పణితి సైదులు, వార్డు కౌన్సిలర్ పణితి ఉషను పరామర్శించారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న చేపల సొసైటీ అధ్యక్షుడు షేక్.రహీంను పరామర్శించారు. మరో బాధితుడు శ్రీకాంత్‌ను మంత్రి, ఎమ్మెల్యే పరామర్శించారు. అంతకముందు మంత్రి పొంగులేటి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని సందర్శించారు. పొంగులేటిని ఎమ్మెల్యే శాలువాతో సన్మానించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావును కూడా ఎమ్మెల్యే సన్మానించారు. ప్రతిగా ఎమ్మెల్యేను మంత్రి, రాయల ఇతర కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, కొణిజర్ల ఎంపీపీ గోసు మధు, రైతుబంధు మాజీ కన్వీనర్ మిట్టపల్లి నాగి, ఏఎంసీ మాజీ చైర్మన్ బీడీకే.రత్నం, నాయకులు దొడ్డా పుల్లయ్య, దాసరి దానియేలు, మచ్చా బుజ్జీ, చెరుకూరి కిరణ్, సూర్యదేవర శ్రీధర్, జాలాది రామకృష్ణ, రెబ్బవరం ఎంపీటీసీ రాయల రమేష్, కౌన్సిలర్ గుగులోతు లక్ష్మీబాయి పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి

- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా

వైరా, ఏప్రిల్ 8: మిషన్ భగీరథ, నీటిపారుదలశాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఆదేశించారు. మిషన్ భగీరథ ఈఎన్‌సీ కృపారెడ్డి, కలెక్టర్ వీపీ.గౌతమ్‌తో కలిసి సోమవారం వైరా రిజర్వాయర్‌ను, మిషన్ భగీరథ పథకాన్ని సందర్శించి పరిశీలించారు. వైరా రిజర్వాయర్‌లో ప్రస్తుత నీటిమట్టం పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. వైరా మిషన్ భగీరథ నుంచి ఎన్ని మండలాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారని ప్రశ్నించారు. తాగునీటి సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉందని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ సమస్య రాకూడదని స్పష్టం చేశారు. ఈ రెండుశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. రిజర్వాయర్‌లో నీటి సమ స్య లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, మిషన్ భగీరథ, నీటిపారుదలశాఖ జిల్లా, డివిజన్, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.


వైరాలో మిషన్ భగీరథను పరిశీలిస్తున్న సుల్తానియా

ప్రజా స్వామ్యంలో ఓటు విలువైనది

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 8: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువైనదని దానిని ప్రతి వినియోగించుకోవాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రాజేశ్వరీ అన్నారు. మండల పరిధిలోని మద్దులపల్లిలోని సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో సోమవారం ఓటరు అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ రాంప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతానికి తలమానికం 'న్యూలిటిల్‌ఫ్లవర్'

- ప్రజాకవి జయరాజు
- ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

వైరా, ఏప్రిల్ 8: పిల్లలకు ప్రకృతితోనే జ్ఞానం సిద్ధిస్తుందని ప్రజాకవి గుడిశల జయరాజు పేర్కొన్నారు. న్యూలిటిల్‌ఫ్లవర్ పాఠశాల జిల్లాలోనే గ్రామీణ ప్రాంతానికి తలమానికంగా ఉందని తెలిపారు. వైరాలోని న్యూలిటిల్‌ఫ్లవర్ పాఠశాల తొమ్మిదో వార్షికోత్సవ వేడుకలు సోమవారం రాత్రి ఘనంగా జరిగాయి. జయరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. పాటే నా ప్రాణం, నా జీవితమని, ఇప్పటివరకు 25సినిమాలకు పాటలు రాశానని, అమ్మపాటలు రాయడమంటే తనకెంతో ఇష్టమని పేర్కొన్నారు. పిల్లలను ప్రకృతికి దగ్గరగా ఉంచాలని తల్లిదండ్రులకు సూచించారు. వైరా ప్రాంతంలో న్యూలిటిల్‌ఫ్లవర్ పాఠశాల నాణ్యమైన విద్యను అందించటాన్ని అభినందించారు. పెమా కన్వీనర్ మువ్వా శ్రీనివాసరావు, పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పోతినేని భూమేశ్వరరావు, డైరెక్టర్లు కుర్రా సుమన్, డాక్టర్ కాపా మురళీకృష్ణ, లగడపాటి ప్రభాకర్ రావు, ప్రిన్సిపాల్ షాజీ మాథ్యూస్, ఏవో ఎస్.నర్సింహారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.


జయరాజును సన్మానిస్తున్న పాఠశాల యాజమాన్యం

తాగునీటి సమస్యలు ఉంటే ఫోన్ చేయండి

సత్తుపల్లిరూరల్/వైరా/మధిరటౌన్ ఏప్రిల్ 8: వేసవి కాలం దృష్ట్యా సత్తుప ల్లి మునిసిపాలిటీ పరిధిలో తాగు నీటి సమస్యలు ఉన్నట్లయితే హెల్ప్‌లైన్ నంబర్ 9704671081కు ఫోన్ చేయాలని మునిసిపల్ కమిషనర్ మందా రవిబాబు సోమవారం ఓ ప్ర కటనలో తెలిపారు. పట్టణంలోని 23వార్డులలో ప్రజలు సం ప్రదించి సమస్యలు పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

వైరా: వైరా మునిసిపాలిటీలో తాగునీటికి సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం మునిసిపల్ కార్యాలయంలో కంట్రోల్‌రూమ్ హెల్ప్ లైన్‌ను కమిషనర్ సీహెచ్.వేణు సోమవారం ప్రారంభించారు. తాగునీటికి సంబంధించిన సమస్యలను 9666926606, 9705280213, 8008491683కు ఫోన్ చేయాలని సూచించారు.

మధిరటౌన్: మధిర మునిసిపాలిటీలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం మునిసిపల్ కార్యాలయంలో సోమవారం కంట్రోల్‌రూం ను ఏర్పాటు చేసారు. మునిసిపల్ కమిషనర్ షఫీఉల్లా దీన్ని ప్రారంభించారు, పట్టణంలో ప్రజలు ఎవరైనా తాగునీటి సరఫరాలో ఇబ్బంది లు ఎదురైతే 996336850 కాల్ చేస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఆర్‌ఐ రాము, ఏఈ నరేష్‌రెడ్డి పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ


రంజాన్‌తోఫా అందజేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్ 8: రంజాన్ సందర్భంగా నిరుపేద ముస్లింలకు కమల్ మిత్రా ఆటో కన్సల్టెన్సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రూ.2లక్షల విలువైన రంజాన్ తోఫాను సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పంపిణీ చేశారు. సోమవారం ఎండీ.కమల్‌పాషా నివాసంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రంజాన్ పర్వదినాన్ని అందరూ సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, కమల్‌పాషా, షాకీర్, మున్వర్, రెహమాన్, రిహానాబేగం, ఆబీదాబేగం, మహరూఫ్, అర్మన్ తదితరులు పాల్గొన్నారు.

వైరా: వైరా మునిసిపాలిటీ పరిధిలోని నిరుపేద ముస్లిం కుటుంబాల వారికి ముస్లిం యూత్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రంజాన్ తోఫా పంపిణీ చేశారు. మజీద్ కమిటీ అధ్యక్షుడు షేక్.మీరా, వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ మీరా సాహెబ్, యూత్ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు షేక్.మహ్మద్ రిజ్వాన్, షేక్.కలీల్, మహ్మద్ రహీం ఖురేషీ, పఠాన్ యాకూబ్‌జానీ, షేక్. సలీం, షేక్.నయీమ్ పాల్గొన్నారు.

మళ్లీ మీరే రావాలి

- ఖమ్మం ఖిలా ఏరియాలో ఎంపీ నామా ప్రచారానికి అనూహ్య స్పందన

ఖమ్మం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం ఎంపీగా మళ్లీ మీరే గెలవాలని నామా నాగేశ్వరరావుతో ఖమ్మం ముస్లిం సోదరులు అన్నారు. సోమవారం రాత్రి ఎంపీ నామా నాగేశ్వరరావు ఖమ్మం ఖిల్లాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముస్లిం నుంచి అనూహ్యమైన స్పందన లభించింది. మసీదులో ప్రార్థనలు కోసం వచ్చిన ముస్లిం సోదరులు ఆప్యాయంగా నామ గారిని ఆలింగనం చేసుకొని, సంతోషం తో పలకరించారు.ఈ ఎన్నికల్లో మీకే పూర్తిస్థాయిలో సహకరిస్తామని ముస్లిం సోదరులు నామాతో అన్నారు. గత ఎన్నికల్లో పూర్తిస్థాయిలో తనను మంచి మెజార్టీతో గెలిపించి పార్లమెంటుకు పంపాలని, ఈసారి జరిగే ఎన్నికల్లో కూడా తనను మంచి మెజారిటీ తో గెలిపించి పార్లమెంటుకు పంపాలని కోరారు. స్పందించిన ముస్లిం మైనార్టీ నాయకులు, ముస్లిం సోదరులు ఈసారి కూడా తప్పనిసరిగా మీకే ఓటు వేసి గెలిపిస్తామన్నారు. ఈ సందర్భంగా నామ అక్కడే జరుగుతున్న ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ ముస్లిం మైనార్టీ సంఘం జిల్లా అధ్యక్షుడు తాజుద్దీన్ తౌశిఫ్ (బాబి) ,ఫిరోజ్ అఫ్సర్ ఇజహర్,ఫిరోజ్, షారుఖ్, నజుమోద్దీన్, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఎంపీ నామా మార్కెట్ ఏరియా కార్మిక సంఘం నాయకులు నున్నా మాధవరా వును స్వగృహానికి వెళ్లి కలిసి ఎన్నికల్లో సహకరించాలని కోరారు. తర్వాత నగరంలోని ప్రముఖ వైద్యులు డాక్టర్ గోపీనాథ్ స్వగృహానికి వెళ్లి ఆయనతో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు.


ఖమ్మం ఖిలా ఏరియాలో నామా ప్రచారం

మట్టి నమూనాల సేకరణ

వైరా, ఏప్రిల్ 8: మండలంలోని గన్నవరం గ్రామపంచాయతీ పరిధిలోని శీలం కొండారెడ్డి అనే రైతు వరిపొలంలో తోటి రైతుల సమక్షంలో సోమవారం ఏవో ఎస్.పవన్‌కుమార్, విస్తరణ అధికారులు మట్టి నమూనాలు సేకరించారు. భూసార పరీక్షలను ఆధారంగా పంటల యాజమాన్య పద్ధతులు, సమగ్ర పోషక పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించవచ్చునని పేర్కొన్నారు. ఏఈవోలు సైదులు, రాజేష్, కీర్తి పాల్గొన్నారు.

నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడిగా హరీష్

మధిర, ఏప్రిల్ 8: నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా నల్లగొండ హరీష్ నియమితులయ్యారు. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన ఫెడరేషన్ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వాలువాయి ఉషాకిరణ్ ఈమేరకు నియామకం చేస్తూ ప్రకటించారు. పలువురు సంఘం నాయకులు హరీష్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేడా విజయ్‌కుమార్, నాయకులు మేడ శ్రీను, అశ్విని, జాన్సీ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు నేడు ధ్రువపత్రాల పరిశీలన

- గ్రూప్ 1 ప్రిలిమ్స్ కోసం

ఎస్సీ నిరుద్యోగులకు 3నెలల ఉచిత శిక్షణ

ఖమ్మం సంక్షేమవిభాగం, ఏప్రిల్ 8: ఖమ్మం జిల్లాలోని ఎస్సీ నిరుద్యోగులకు పోటీ పరీక్షల కోసం 3నెలల పాటు ఉచిత భోజన, వసతితో కూడిన శిక్షణ ఇస్తామని సాంఘీక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రూప్ 1 ప్రిలిమ్స్ కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ప్రారంభిస్తున్నామన్నారు. ఈనెల 9న ఉదయం 10గంటలకు అభ్యర్థులు స్టడీ, కుల ధృవపత్రాలతో ఖమ్మంనగరంలోని రాపర్తినగర్‌లో ఉన్న ఎస్సీ స్టడీ సర్కిల్‌కు వచ్చి దరఖాస్తులు చేయాలన్నారు. 100 మంది ఎస్సీ నిరుద్యోగులకు అవకాశం ఉందన్నారు. పూర్తి వివరాలకు 9848494290 నెంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.

వీవీ విద్యార్థికి యంగ్ జీనియస్ అవార్డు

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్8: ప్రతిష్ఠాత్మకమైన యంగ్ జీనియస్ అవార్డును వీవీ విద్యాలయం విద్యార్థి అందుకున్నట్లు ప్రిన్సిపాల్ గోరింట్ల వంశీకృష్ణ సోమవారం తెలిపారు. హైదరాబాద్‌లోని సుచిరిండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 3నుంచి9వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన సర్ సీవీ రామన్ రాష్ట్రస్థాయి ఒలింపియాడ్ పరీక్షలలో సత్తుపల్లి పట్టణానికి చెందిన వీవీ విద్యాలయం విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు.ఈ అవార్డును ఫౌండేషన్ సీఈవో లయన్ డాక్టర్ వై.కిరణ్, డీఆర్‌డీవో డీడీ (ఆర్డీ) చైర్మన్ రక్షణమంత్రి మాజీ సైంటిఫిక్ అడ్వైజర్, డాక్టర్ సతీష్‌రెడ్డి, సినీ గీత రచయిత చంద్రబోస్‌ల చేతులమీదుగా కేశవ్‌నందన్ అందుకున్నాడు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల కరస్పాండెంట్ ఒగ్గు భగవాన్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

తీర్దాల మాజీ సర్పంచ్ భర్తపై సీపీకి ఫిర్యాదు

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 8: మండల పరిదిలోని తీర్దాల మాజీ సర్పంచ్ భర్త వడ్డే రామయ్య పై పోలిశెట్టిగూడెం గ్రామానికి చెందిన అప్పాల రవి సీపీకి ఫిర్యాదు చేసినట్లు సోమవారం తెలిపాడు. రవి వడ్డే రామయ్య గ్రామంలో నీటి కాల్వలను, ప్రభుత్వ భూములు, ఆక్రమిం చి ధరణి ద్వారా పాస్‌పుస్తకాలు పొందాడని, గ్రామ పం చాయతీ సీసీ రోడ్డు కూడా తన భూములోంచి వేశానని ఆ రోడ్డుపైనుంచి ఎవరిని వెళ్ల నీయకుండా అడ్డుకుంటున్నాడని తన ఫిర్యాదులో పేర్కోన్నాడు.

ఎమ్మెల్యే కనకయ్య ప్రత్యేక పూజలు

కామేపల్లి, ఏప్రిల్ 8: కామేపల్లి మండలం పరిధిలోని కొత్తలింగాల శ్రీకోటమైసమ్మ అమ్మవారి జాతర సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య పాల్గొన్నారు. ఉగాది పర్వదినం పురస్కరించుకొని జాతర కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాట్లాడుతూ అమ్మవారిని త్వరలో పునఃనిర్మాణం చేసి అమ్మవారి ప్రతిష్ఠాపన చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. క్రోధి నామ సంవత్సరంలో అందరికి మంచి జరగాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గింజల నర్సింహరెడ్డి, ఎంపీటీసీలు రాంరెడ్డి జగన్నాతరెడ్డి, నల్లమోతు లక్ష్మయ్య, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు జిల్లా కాంగ్రెస్ నాయకులు ఏపూరి మహేందర్, డీఎస్, రాంబాబు, గఫ్బూ, గోపిరెడ్డి, రామక్రిష్ణ, జర్పల లక్ష్మణ్, మల్లయ్య, సైదులు, సరిరాం నాయక్ పాల్గొన్నారు

జిల్లా సమగ్రాభివృద్ధి బీజేపీకే సాధ్యం

- ఖమ్మం లోక్‌సభ బీజేపీ అభ్యర్థి వినోదరావు

మధిర/ఎర్రుపాలెం, ఏప్రిల్ 8: అన్ని రంగాల్లో జిల్లా సర్వతోముఖాభివృద్ధి జరగాలంటే బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని ఆపార్టీ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోదరావు కోరారు. సోమవారం మధిర నియోజకవర్గం పర్యటనలో బాగంగా మధిరలో జరిగిన రోడ్‌షోలో ఆయన పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఇప్పటివరకు అన్ని పార్టీలకు అవకాశం ఇచ్చారని ఒకసారి బీజేపీకి అవకాశం ఇచ్చి ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వాన్ని బలపర్చాలని కోరారు. మధిరలో అంబేద్కర్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం రోడ్ షోలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారాయణ, మధిర అసెంబ్లీ ఇన్‌చార్జ్ ఏలూరు నాగేశ్వరరావు, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు కూరపాటి సునీల్ , బీజేపీ జిల్లా కార్యదర్శి చిలువేరు సాంబశివరావు, జిల్లా అధికారప్రతినిధి రామిశెట్టి నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు పాపట్ల రమేష్, మండల అధ్యక్షులు గుండా చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు గుగులోతు నాగేశ్వరరావు, నూతక్కి నర్సింహారావు, మర్సకట్ల స్వర్ణాకర్, దేవరకొండ కోటేశ్వరరావు, కాసిన నాగభూషణం, బియ్యవరపు రామకృష్ణ, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

మోదీకి మించిన గ్యారంటీ లేదు

ఎర్రుపాలం: దేవానికి, రాష్ట్రానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీనే పెద్ద గ్యారంటీ అని, ఆయనకు మించిన గ్రారంటీ ప్రజలకు అవసరంలేదని ఖమ్మం పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు అన్నారు. మండలంలో జమలాపురం ఆలయాన్ని దర్శించుకొని జమలాపురం, వెంకటాపురం, రేమిడిచర్ల, కొత్తపాలెం, ఎర్రుపాలెం గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, మధిర నియోజకవర్గ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు నూతక్కి నర్సింహారావు, నాయకులు విజయరాజు, పుప్పాళ్ల చంద్రమౌళి, దేవరకొండ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


మధిరలో ప్రచారం నిర్వహిస్తున్న వినోదరావు

బీజేపీ చేసిన అభివృద్ధి ప్రచారం చేయండి

ఖమ్మం బైపాస్‌రోడ్, ఏప్రిల్ 8: దేశంలో బీజేపీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు గ్రామాల్లో ఉన్న ప్ర జలందరికీ తెలియాలని ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ అన్నారు. నగరంలోని బీజేపీ పార్లమెంటరీ కార్యాలయంలో సోమవారం రాత్రి జరిగిన దళిత మోర్చా సమ్మేళనం కార్యక్రమంలో శ్రీధర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోదరావు, గల్లా సత్యనారాయణ, సన్నే ఉదయ్‌ప్రతాప్, నంబూరి రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కవచంలా గృహహింస చట్టం

- సత్తుపల్లి సీనియర్ సివిల్ న్యాయాధికారి అరుణకుమారి

సత్తుపల్లి, ఏప్రిల్ 8: వేధింపులకు గురవుతున్న మహిళలకు రక్షణ కవచంలా గృహహింస చట్టం రూపొందించారని సత్తుపల్లి సీనియర్ సివిల్ జడ్జీ పీ.అరుణకుమారి అన్నారు. సోమవారం సత్తుపల్లి మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో స్థానిక స్త్రీశక్తి భవనంలో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో 498(ఏ) ఐపీసీ, 125సీపీపీసీ, గృహహింస చట్టాల గురించి వివరించారు. మహిళలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు ఆరోగ్య సూత్రాలను సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు బరిగే అయ్యప్ప, నల్లగట్ల విజయ్‌కుమార్, సాంబశివరావు, బీ.దాసు, జమలయ్య, హ్యూమన్‌రైట్స్ డైరెక్టర్ దాసు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఘనంగా ఉగాది వేడుకలు

ఖమ్మం ఖానాపురంహవేలి ఏప్రిల్ 8: ఖమ్మం నగరంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో సోమవారం ముందస్తు ఉగాది వేడుకలు నిర్వహించారు. విద్యార్థులకు ఉగాది పండుగ విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమాల్లో యాజమాన్యాలు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఖమ్మం నగరంలోని సర్వజ్ఞ పాఠశాలలో..



స్మార్ట్‌కిడ్జ్ పాఠశాలలో..


త్రివేణి పాఠశాలలో



శ్రీనగర్‌కాలనీ రెజోనెన్స్‌లో


వైరా మధు విద్యాలయంలో..

ఇఫ్తార్ విందులో పాల్గొన్న మంత్రి తుమ్మల

ఖమ్మం సంక్షేమవిభాగం, ఏప్రిల్ 8: రంజాన్ మాసం ముస్లీం, మై నార్టీ సోదరులు ప్రశాంతంగా జరుపుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆకాంక్షించారు. సోమవారం ఖమ్మంనగరంలోని కాంగ్రెస్ నాయకులు చోటేబాబా నివాసంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపాల్గొని ముస్లీం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. స్థానికంగా ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగండ్ల దీపక్‌చౌదరి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, నాయకులలు సాధు రమేశ్‌రెడ్డి, మిక్కిలినేని నరేందర్, తుపాకుల ఎలగొండ స్వామి, ఎండీ హుస్సేన్ పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందులో మంత్రి తుమ్మల